క్లుప్తంగా

మండలానికి 279 కొత్త పింఛన్లు



కొత్తగా మంజూరైన పింఛన్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో సాంబశివరావు

పాయకరావుపేట: మండలంలో కొత్తగా 279 పింఛన్లు మంజూరయ్యాయి. మండలంలోని 24 గ్రామాల పరిధిలో ఇంతవరకు 12,679 పింఛన్లు ఉండగా, ఇపుడు అదనంగా కొత్త పింఛన్లు మంజూరైనట్లు మండల అభివృద్ధి అధికారి ఎ.సాంబశివరావు శుక్రవారం తెలిపారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, తుది నిర్ణయం తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

మునగపాక తహసీల్దార్‌గా రవికుమార్



రవికుమార్, తహసీల్దార్

మునగపాక: మునగపాక మండల తహసీల్దార్‌గా రవికుమార్ నియమితులయ్యారు. ఇంత వరకు తహసీల్దార్‌గా పనిచేసిన పి.ప్రకాశరావు విధి నిర్వహణలో అలసత్వం వహించారన్న కారణంతో సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అచ్యుతాపురం తహసీల్దార్ వై.శ్రీనివాసరావును నియమించినా ఆయనా ఆసక్తి చూపలేదు. దీంతో నర్సీపట్నం తహసీల్దార్‌గా పనిచేస్తున్న రవికుమార్‌ను మునగపాకకు బదిలీ చేశారు. ఆయన త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

29న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మునగపాక: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 29న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన ఆ రోజు ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరుకావాల్సిందిగా కోరారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

రాంబిల్లి: పంచాయతీ పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి దేముడునాయుడు కోరారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు.

స్వచ్ఛందంగా గుడిసెల తొలగింపు

మునగపాక: మండలంలోని గంగాదేవిపేటలో చెరువును ఆక్రమించి గుడిసెలు నిర్మించిన పేదలు శుక్రవారం స్వచ్ఛందంగా తమ గుడిసెలను తొలగించారు. గత కొద్ది రోజులుగా ఆక్రమణకు సంబంధించి రెవెన్యూ, ఆక్రమణదారుల మధ్య వివాదం నడుస్తోన్న విషయం తెలిసిందే. ఈ నెల 24న రెవెన్యూ సిబ్బంది జేసీబీతో వచ్చి గుడిసెలను తొలగించేందుకు ప్రయత్నించారు. దీంతో తమకు ఒక రోజు అవకాశం ఇస్తే తామే స్వచ్ఛందంగా గుడిసెలను తొలగిస్తామంటూ ఆక్రమణ దారులు అభ్యర్థించారు. ఈ మేరకు శుక్రవారం గుడిసెల్ని వారే తొలగించారు. దీంతో రెవెన్యూ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

ట్రిపుల్ ఐటీకి దిబ్బపాలెం విద్యార్థి



యోగేంద్ర

అనకాపల్లిటౌన్: మండలంలోని దిబ్బపాలెం హైస్కూల్ నుంచి 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థి సిరసపల్లి యోగేంద్ర ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. ఈ మేరకు యోగేంద్రను శుక్రవారం గ్రామ ఎంపీటీసీ పి.అచ్చియ్యమ్మ, హెచ్‌ఎం జి.ఉమామహేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ యల్లపు రామచంద్రరావు, కమిటీ సభ్యులు అభినందించారు. బాగా చదివి, ఉన్నత స్థానంలో నిలవాలని అభిలషించారు.

శ్రీ వరలక్ష్మీ నమస్తు వసుప్రదే, సుప్రదే

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం
- ఇళ్లు, దేవాలయాలకు శ్రావణశోభ

'వర'అంటే శ్రేష్టమైనది అని అర్థం. వరలక్ష్మీ దేవి అంటేనే వరాలిచ్చే తల్లి. కేవలం ధనమే కాదు.. ధాన్య, పాడిపశు, గుణ, జ్ఞాన సంపద లెన్నింటికో అధిష్టాన దేవత. ఈ వ్రతాన్ని భక్తితో చాలు మనం కోరిన వరాలన్నీ ఇచ్చే కల్పవల్లి. అందుకే ఊరూవాడా మహిళలు శ్రావణ మాస రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాలు తమ శక్తిమేర ఘనంగా చేశారు. వ్రతం పరిసమాప్తి అయ్యాక ముత్తైదువులను పిలిచి, వారికి తాంబూలాలందించి ఆశీస్సులు పొందారు.



నక్కపల్లిలో అమ్మవారి కలశానికి పూజలు నిర్వహిస్తున్న మహిళ



ఉపమాకలో ఆండాళ్లమ్మకు తిరువీధి సేవ



ఆండాళ్లమ్మవారిని నూతన వస్త్రాలతో అలంకరించిన అర్చకులు



చిట్టూరి వరమహాలక్ష్మీకి పసుపు కొమ్ములతో పూజలు



ఉమ్మలాడలో దేవీతల్లి సన్నిధిలో భక్తులు



పీఎన్ఆర్ పేట దుర్గాదేవి అమ్మవారి సన్నిధిలో భక్తులు

నక్కపల్లి : వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణంలో వచ్చే శుక్రవారం లక్ష్మీదేవికి ఇష్టమైన రోజు కావడంతో తమ ఇంట సిరిసంపదలు సమృద్ధిగా ఉండాలని, పసుపుకుంకుమలు కలకాలం నిలవాలని వివాహిత మహిళలు ఈ వ్రతాన్ని ఆచరించారు. అమ్మవారికి ప్రీతికరమైన గారెలు, పూర్ణాలు, పాయసం, పులిహోర తదితర 9 రకాల పిండివంటలతో నైవేద్యాన్ని సమర్పించారు. ప్రతి ఇల్లు శ్రావణశోభతో కళకళలాడాయి.

- నక్కపల్లి, ఉపమాక, సారిపల్లిపాలెం, మనబాన వానిపాలెం తదితర గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. వరలక్ష్మి వ్రతం రోజున అమ్మవారిని దర్శించుకునేందుకు మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు.
- ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న ఆండాళమ్మవారికి తిరువీధి సేవ నిర్వహించారు. అనంతరం ఆండాళ్‌తల్లికి లక్ష్మీసహస్రనామ కుంకుమార్చన జరిగింది. కార్యక్రమాల అనంతరం సాయంత్రం సేవా కాలం, ప్రసాదవినియోగం నిర్వహించినట్లు ఆలయ ప్రధానార్చకులు జి.వరప్రసాదాచార్యులు తెలిపారు.

పసుపు కొమ్ములతో పూజ

పాయకరావుపేట: శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. మండలంలోని గ్రామాల్లోను, పట్టణంలోని బృందావనం, దుర్గానగర్, చెక్కానగర్ దుర్గాలమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిట్టూరి మెట్రో నందు గల శ్రీవరలక్ష్మీ అమ్మవారిని పసుపు కొమ్ములతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మునగపాక: మండల వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మీదేవి అమ్మవారి వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో జరిపారు. అమ్మవారిని పలు రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మలాడలో శ్రీదేవీ తల్లి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ చైర్మన్ పల్లె అప్పలనాయుడు, ఇతర పాలకవర్గం భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

యలమంచిలి: యలమంచిలి మండలం, పట్టణంలో మహిళలు వరలక్ష్మి వ్రతాలు ఆచరించారు. పిండి వంటలు చేసి అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. పలుగ్రామాల్లో అమ్మవార్ల ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు వచ్చిన మహిళలతో సందడి వాతావరణం నెలకొంది. మండలం పట్టణంలో కనకమహాలక్ష్మి, సంతోషిమాత, పెంజెరువు దుర్గమ్మ, భూలోకమాంబ అమ్మవారు, కృష్ణాపురం వరలక్ష్మి అమ్మవారు, పద్మనాభరాజుపేట దుర్గాదేవి ఆలయాలకు మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చి, పూజలు చేశారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): శ్రావణ మాస రెండవ శుక్రవారాన్ని పురస్కరించుకుని అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం-అందలాపల్లి భగీరథమ్మ ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని గ్రామాల్లోనూ వరలక్ష్మీ వ్రతాలు చేపట్టారు. ఇళ్లల్లో మహిళలు నూతన వస్త్రాలు ధరించి, కలశంపై అమ్మవారి రూపును ఏర్పాటుచేసి, పూజించారు.

ఎస్.రాయవరం: మండలంలో శ్రావణ శుక్రవారం పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు వేకువనే నిద్రలేచి, స్నానమాచరించి, పూజగదిని ప్రత్యేకంగా అలంకరించుకుని వ్రతాలు చేశారు. అనంతరం సమీప అమ్మవారి ఆలయాలకు వెళ్లి దర్శనం చేసుకున్నారుఏ. దార్లపూడి శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోటవురట్ల: శ్రావణమాసపు శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లెల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పెద్ద సంఖ్యలో భక్తుల రాకతో ఆలయాలు కిటకిటలాడాయి.



కోటవురట్లలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు



దార్లపూడి శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వ్రతాలు చేస్తున్న మహిళలు



హరిపాలెం-అందలాపల్లి భగీరథమ్మ గుడిలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



కృష్ణాపురంలో అమ్మవారి ఆలయం వద్ద వ్రతాల్లో భక్తులు

వైఎస్సార్‌సీపీలో నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానం

అనకాపల్లి రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, పార్టీలో నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పిస్తున్నారని అనకాపల్లి జిల్లా నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశనకుర్తి అప్పారావు, ప్రధాన కార్యదర్శి కందికుప్ప గోవిందరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షునిగా రౌతు శంకర్రావు నియామకంపట్ల వారు పార్టీకి, అధినేత, సీఎం జగన్‌కు శుక్రవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఎస్.రాయవరం మండలానికి చెందిన శంకర్రావు విశ్రాంత ఉపాధ్యాయుడు. వృత్తి రీత్యా శ్రీకాకుళం జిల్లాలో స్థిరపడిన ఆయన వైఎస్సార్‌సీపీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. దీనిని గుర్తించిన పార్టీ అధిష్టానం ఆయనకు ఉపాధ్యక్షునిగా పదవి నిచ్చి, గౌరవించడం తమకు ఆనందంగా ఉందన్నారు. ఆయన నియామకం పట్ల జిల్లాకు చెందిన నాయీ బ్రాహ్మణ సంఘం నేతలంతా హర్షం ప్రకటించారు. తమకు సముచిత గౌరవం ఇస్తున్న వైఎస్సార్‌సీపీకి తాము కూడా అదే విధమైన మద్దతును అందిస్తామని తెలిపారు.

ఘనంగా గ్రంథాలయ వార్షికోత్సవం



వాడ్రాపల్లిలో పుస్తక ప్రదర్శన జరుపుతున్న దృశ్యం

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో స్వర్గీయ పెతకంశెట్టి జోగినాయుడు మాస్టారు గ్రంథాలయ 12వ వార్షికోత్సవ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా తొలి రోజు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. వేడుకలను సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, గ్రంథాలయ కమిటీ గౌరవ అధ్యక్షులు రామజోగినాయుడులు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాలకు రావడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకునే అవకాశం ఉంటుందన్నారు. 26, 27, 28 తేదీల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. 28న వేడుకల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు మళ్ల వరహానరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులోకి హోటల్ వ్యర్థాలపై రైతుల ఆగ్రహం



హోటల్ నుంచి విడుదలవుతున్న వ్యర్థాలను చూపిస్తున్న రైతులు

నక్కపల్లి: మండలంలోని కాగిత సమీపంలో ఉన్న జాస్ హోటల్ వ్యర్థాలను సమీపంలోని సాగునీటి చెరువులోకి విడిచిపెడుతున్నారని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం రైతు నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, ఉప సర్పంచ్ దేవరపు కృష్ణ, అడపా గణేష్‌రావు తదితరులు చెరువును పరిశీలించారు.

జాతీయరహదారిని ఆనుకుని ఉన్న జాస్ హోటల్ యాజమాన్యం వ్యర్థాల పారబోతకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోకుండా, సమీపంలోని సాగునీటి చెరువులోకి విడిచిపెట్టడంతో, సాగునీరు కలుషితమవుతోందని ఆరోపించారు. ఆయకట్టు రైతులంతా ఈ నీటినే సాగుకోసం ఉపయోగిస్తారని, కలుషిత నీటి వల్ల పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. హోటల్ వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే హోటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకుని, వ్యర్థాలను చెరువులోకి విడిచిపెట్టకుండా నియంత్రించాలని రైతులు కోరుతున్నారు.

సెజ్ భూ సేకరణ పునరావాసంపై సర్వే



కృష్ణంపాలెం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

రాంబిల్లి: సెజ్ రెండో విడత భూసేకరణలో ఉన్న కృష్ణంపాలెం గ్రామంలో పునరావాసం కోసం నిర్వహిస్తున్న సర్వేకు సహకరించాలని ఆర్డీవో చిన్నికృష్ణ కోరారు. శుక్రవారం గ్రామంలో గ్రామసభను నిర్వహించారు. కొన్నేళ్లుగా సర్వే చేయడమే తప్ప, పునరావాసం కల్పించలేదని అలాంటపుడు సర్వే ఎందుకని గ్రామస్తులు ప్రశ్నించారు. ఈసారి హరిపురం, పంచదార్ల వద్దనున్న బీసీటీ సంస్థ సమీపంలో పునరావాస స్థలాలు కేటాయిస్తామని, సర్వేకు సహకరించాలని ఆర్డీవో కోరారు. తహసీల్దార్ పి.భాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

చేనేత సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

అచ్యుతాపురం(అనకాపల్లి): ఈ నెల 27న గాజువాకలో నిర్వహించే చేనేతల సభకు చేనేత కార్మికులు తరలిరావాలని రాష్ట్ర చేనేత కార్మిక సంఘాల నాయకుడు పిల్లమర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరులో ఉన్న శ్రీ భద్రావతి చేనేత సొసైటీలో శుక్రవారం గాజువాక సభల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలు, ఇతర అంశాలపై చర్చించేందుకు గాజువాక బాల చెరువు టీఎస్ఆర్ కల్యాణ మండపంలో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పప్పు రాజారావు, మాడెం నూకరత్నం, సూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసేవారికి పార్టీలో తగిన గుర్తింపు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌ను సత్కరించి మొక్క అందిస్తున్న అప్పారావు

మునగపాక: పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా కార్యదర్శిగా నియమితులైన దాసరి అప్పారావు శుక్రవారం రాత్రి బొడ్డేడను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ ఇప్పటి నుంచే పనిచేయాలన్నారు. పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రసాద్‌కు మొక్కను అప్పారావు అందించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ మరింత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట పార్టీ నేతలు ఇల్లా నాగేశ్వరరావు, కర్రి నాగిరెడ్డిలు ఉన్నారు.

సూరిశెట్టికి అభినందనలు



రమణ అప్పారావుకు కృష్ణుడి విగ్రహాన్ని అందిస్తున్న పార్టీ శ్రేణులు

అనకాపల్లిటౌన్: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సూరిశెట్టి రమణ అప్పారావును శుక్రవారం ఆయన స్వగృహంలో జిల్లాకు చెందిన పలువురు పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. రమణ అప్పారావు నియామకం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు రమణ అప్పారావుకు జిల్లా యువజన నాయకులు కర్రి మహాలక్ష్మినాయుడు, సత్యదేవ్ ఆస్పత్రి అధినేత డాక్టర్ లక్ష్మీనర్సింహారావు, బొడ్డేడ కిరణ్, 82వ వార్డు యువజన నాయకులు బొడ్డేడ కిరణ్, విల్లూరి సంతోష్, చోడవరం పార్టీ వెలమ విభాగం నేత జూరెడ్డి పృధ్విరాజ్‌లు దుశ్శాలువ కప్పి, కృష్ణుని విగ్రహాన్ని బహూకరించారు.

చంద్రయాన్-3 విజయం గర్వకారణం

అనకాపల్లిటౌన్: చంద్రయాన్-3 విజయం భారతీయులందరూ గర్వించదగ్గ విషయమని ఏఎంఏఎల్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు విల్లూరి అప్పలస్వామినాయుడు అన్నారు. స్థానిక పాలూరి చిదంబరం మెమోరియల్ రోటరీ హాలులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విజయం వెనుక ఇస్రో తీసుకున్న జాగ్రత్తలను వివరించారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి, దివంగత అబ్దుల్ కలాంను కలవడం తన జీవితంలో మరిచిపోలేని అనుభూతిని మిగిల్చిందన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం గవర్నర్ వ్యవస్థ అధికారాలు, ఆర్టికల్ 356 ప్రాధాన్యత, దుర్వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు పి.జె.నాయుడు, కార్యదర్శి ఆడారి రామకృష్ణ, కోశాధికారి రాపేటి నారాయణరావు, అధిక సంఖ్యలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వరుణుడి వైపు అన్నదాతల చూపు

- వర్షాభావ పరిస్థితులతో ఆందోళన
- ముందుకు సాగని ఖరీఫ్ పనులు
- ఆగస్టు ముగుస్తున్నా 20 శాతమే నాట్లు

వరుణుడి కరుణ కోసం అన్నదాతలు ఆశగా ఆకాశం వేపు చూస్తున్నారు. చాలా ఏళ్ల తర్వాత వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా ఖరీఫ్ పనులు ముందుకు సాగడం లేదు. పలు చోట్ల వరినారు ఎండిపోయే స్థితికి చేకున్నాయి. ఆగస్టు నెల గడిచిపోతున్నా 20 శాతం దాటి వరి నాట్లు జరగలేదు. దీంతో రైతాంగంలో ఆందోళన నెలకొంది.

రాంబిల్లి: వరుణుడు కరుణించక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కోటి ఆశలతో ఖరీఫ్ పనులు ప్రారంభించిన అన్నదాతలు సాగునీరు సరిపోక అవస్థలు పడుతున్నారు. ఎండిపోతున్న వరినారు, దమ్ము పట్టిన, వరినాట్లు వేసిన పొలాలను చూసి కలవరపడుతున్నారు. ఆకాశం వైపు దిగాలుగా చూస్తున్నారు.

వరినాట్లు పడేనా?

యలమంచిలి సబ్ డివిజన్ పరిధి మండలాల్లో ఏ గ్రామంలో చూసినా రైతులు వర్షం కోసమే చర్చించుకుంటున్నారు. డివిజన్ పరిధిలో యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, ఎస్.రాయవరం మండలాలున్నాయి. ఈ మండలాల్లో వరి సాధారణ విస్తీర్ణం 9,169 హెక్టార్లు. ఇప్పటి వరకు కేవలం 1,816 హెక్టార్లలో మాత్రమే వరినాట్లు పడ్డాయి. 20 శాతం కూడా నాట్లు పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వరినాట్లు వివరాలు(హెక్టార్లలో)

మండలం	సాధారణ విస్తీర్ణం	నాట్లు పడిన విస్తీర్ణం
రాంబిల్లి	2726	540
యలమంచిలి	2204	426
అచ్యుతాపురం	762	150
ఎస్.రాయవరం	3479	700



దిమిలి సమీపంలో ఎండిపోయిన వరినారు

ఈ ఏడాది వర్షపాతం(మి.మీ.లలో)

మండలం	సాధారణ వర్షపాతం	పడిన వర్షం
రాంబిల్లి	374.5	254.1
యలమంచిలి	413.5	237.7
అచ్యుతాపురం	414.5	287.9
ఎస్. రాయవరం	419.4	378.8



కట్టుబోలు సమీపంలో నాట్లు వేయక పొలంలో మొలిచిన గడ్డి

ప్రత్యామ్నాయం లేదాయే!

సాగునీటి కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాలు పడకపోవడంతో పాటు శారద నదిలో నీరు బాగా తగ్గిపోయింది. సాగునీటి కాలువల్లో అంతంత మాత్రంగానే నీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ ఆశలు కూడా లేక రైతులు నిరాశ చెందుతున్నారు. కొన్ని చోట్ల కాలువల్లో వస్తున్న అరకొర నీటి కోసం రైతులు తగాదాలు పడాల్సి వస్తోంది. రాత్రుళ్లు నిద్రకు దూరమై నీటి కోసం పొలాల్లోనే తిరుగుతున్నారు. పలుచోట్ల వరి నారు మడులు, దమ్ము చేసిన పొలాలు సైతం ఎండిపోతున్నాయి. కొన్నిచోట్ల దమ్ము చేయక పొలాల్లో పచ్చ గడ్డి దర్శనమిస్తోంది.

సాగునీటికి ఇబ్బందులు



చాలా ఏళ్ల తర్వాత వర్షాభావ పరిస్థితుల్ని ఈ ఏడాది చూస్తున్నాం. ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. మేఘాలు, ఉరుములు, మెరుపులు వస్తున్నా చినుకు రాలట్లేదు. శారద నది కూడా అడుగంటిపోవడంతో వరినాట్లు ముందుకు సాగట్లేదు.

– బి.రాజు, రైతు, దిమిలి

మరో 10 రోజులు చూడాలి

రైతులు మరో 10 రోజుల పాటు వరినాట్లు వేసేందుకు ఎదురు చూడాలి. ఈలోగా వర్షాలు పడి, శారదా నదిలో నీరు వస్తే వరి నాట్లు దాదాపు పూర్తవుతాయి. అప్పటికీ వరినాట్లు పడకపోతే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

– రవిప్రకాష్, ఏడీఏ, యలమంచిలి

వరి నాట్లు ముమ్మరం



యండపల్లిలో వరి నారు తీస్తున్న కూలీలు

కోటవురట్ల: ఖరీఫ్ వరి నాట్లు చివరి దశకు చేరుకున్నాయి. మండలంలో వరి నాట్లు ఇప్పటికే దాదాపు 70 శాతం పూర్తయ్యాయి. మిగిలిన చోట్ల పూర్తి చేసేందుకు చురుగ్గా వ్యవసాయ పనులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కొడవటిపూడి, పాములవాక, చినబొడ్డేపల్లి, పి.కె.పల్లి, ఆక్సాహేబుపేట, కె.వెంకటాపురం, తిమ్మాపురం, లింగాపురం, జల్లూరు, యండపల్లి, కైలాసపట్నం, రాజుపేట ప్రాంతాలలో వరినాట్లు పడుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగు 1680 హెక్టార్లు లక్ష్యంగా వ్యవసాయాధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు.